# తృప్తి

ఉన్న పళంగా చిన్న బాబుగారు పిలుచుకొని రమ్మంటున్నారు అని నరసింహులు ద్వారా పిలుపందగానే నేననుమానించాను. చినబాబు బుర్రలో ఏదో ఒక కొత్త ఊహ తళుక్కున మెరసి ఉంటుంది. అతడి బుర్రలో అలా ఒక కొత్త ఊహ మెరిసినప్పుడల్లా దాన్ని కార్యరూపంలో పెట్టడానికి ఒకరి సలహానో, కాక తోడ్పాటో అవసరమౌతూ ఉంటుంది.

ఊరంతా చిన్నబాబుగా వ్యవహరించే ఆ బక్క పలచటి ఎర్రటి యువకుడి పేరు శ్రీహరి. అతడు పుట్టడానికైతే ఈ ఊరిలోనే పుట్టాడు. గానీ పెరిగింది మాత్రం ఈ ఊరుగాదు."ఆయువు నూరు సంవత్సరములందు సగంబు గతించె నిద్రలో"- అంటూ మునుపటి కొకాయన వాపోయాడు. ఆ మిగిలిన సగంలో సగం విద్యాభ్యాసానికే సరిపోతుంది గదా అని చింతిస్తూ కూర్చోవలసిన అసంఖ్యాక భారతీయ విద్యార్థుల్లో శ్రీహరి ఒక్కడు. అలాగని ప్రతి తరగతిలోనూ నింపాదిగా రెండు మూడేళ్లు కూర్చున్నాడని శ్రీహరిని అపార్థం చేసుకోడం అన్యాయం. అయిదేళ్ళ వయసులో అతడు మహా నగరంలోని ఒకానొక కాన్వెంటు పాఠశాలలో చేర్పించబడ్డాడు. ప్రాథమిక విద్య ముగిసిన తర్వాత అక్కడే ఉన్నత పాఠశాలలో చేరాడు. ఆపైన కాలేజీ చదువు. లోకం దృష్టిలో వట్టి బి.య్యే. వరహీనపు పెళ్ళికొడుకులా చులకనగా ఉండడం వల్లనైతేనేమి, జీవితాంతం చదువుకుంటూనే ఉండిపోయినా జరుగుబాటుకు కొదువలేకపోవడం వల్లనైతేనేమి, శ్రీహరి మళ్ళీ ఇంజనీరింగులో చేరాడు. చిన్ననాడే వివాహమై కాపురానికి వెళ్ళిపోయిన అమ్మాయి పుట్టింటి కోసం ముఖం వాచిపోవడం సహజం! అత్తింటి కోడల్లా ఏడాది కొకసారి స్వగ్రామానికి వచ్చేస్తాడు శ్రీహరి. అమ్మాయికి అమ్మగారింట్లో తీరే ముద్దు ముచ్చటల్లా శ్రీహరికి స్వగ్రామంలో తీరే సరదాలు కొన్ని ఉన్నాయి. కోనేటి బావిలో ఈదులాట. చిట్టడివిలో సెలయేటి జన్మస్థానం కోసం అన్వేషణ. వెన్నెల రాత్రుల్లో గ్రామీణ యువకులకు

బస్తీ ఆటల్లో తరిబీదు. ఇలాంటి వ్యాసంగాలతో దినాలు క్షణాలుగా గడిపివేసే శ్రీహరిని గురించి ఇక్కడే ఇంకొక మాట గూడా చెప్పవలసి ఉంది. ఎలాంటి సామాన్యమైన పని చేస్తున్నా, దాన్ని సాహసికపు పై పూతలో నుంచి చూచి ఆనందించడం శ్రీహరి స్వభావం. టెంకాయ చెట్టుపై కెగబ్రాకుతూ అతడు టెన్సింగులా ఉప్పొంగి పోగలడు. సెలయేటి కెదురుగా చిట్టడివిలో నడుస్తూ, ఆఫ్రికాఖండ దుర్గమారణ్యాల్లో సంచరించిన సాహసిక యాత్రికులకు మల్లే నిర్భీతిని ప్రకటించగలడు. ఐనా చేస్తున్న పనిలో ఏముంది? అంతా అనుకోడంలోనే ఉంది. పరమానందయ్య శిష్యుడికి తీసిపోని శాంకోపాంజాయే అంగరక్షకుడుగా, ఎముకలు పైకి తేలిన బక్క గుర్రమే గంధర్వాశ్వంగా, తాతల కాలంనాటి త్రుప్పు పట్టిన పోరాటపు పనిముట్లే యుద్ధ సాధనాలుగా దేశం పైకి బయల్దేరిన డాన్క్విక్ సాట్ అన్న పెద్ద మనిషి తాను చేస్తున్న పనిని వీరోచిత కృత్యంగా, అంతకుమించి దిగ్విజయ యాత్రగా తలపోశాడంటే అందుకు కారణం అతడి మనసులోగాక మరెక్కడుంది?

వెళ్లేసరికి హాల్లో తూగుటయ్యేలపైన కూర్చుని ఊగుతున్నాడు శ్రీహరి. పై కప్పునుంచీ వ్రేలాడుతున్న గొలుసుల్ని భూమ్యాకర్షణ శక్తితో పోలిస్తే తూగుటుయ్యేలను కొంచెం ఇంచుమించుగా అంతరిక్ష నౌకతో ఉపమించవచ్చు. బహుశా శ్రీహరి అలాంటి అనుభవాన్ని పొందుతున్నాడేమో తెలియదు.

"సుస్వాగతమయ్యా రాజశేఖరం! పాలేరు ద్వారా కబురు పెట్టినా తమ దర్శనాలు దొరకడం లేదు. ఇంతకూ జరుగుతున్నవి బడి రోజులైనా కావు. వేసవి సెలవులు. ఈ వూళ్లో నీ ప్రొద్దు పోకడకు లభ్యమౌతున్న కాలక్షేపా లేమిటో తెలియదు. అసలీ ఊళ్లో ఎవరిని చూచినా నా కదే ఆశ్చర్యం. ఊరి ప్రక్కనే రోడ్డుంది. రోడ్డులో బస్సులు తిరుగుతుంటాయి. ఆ బస్సుల్ని చూచినప్పుడైనా ఈ ఊరికి చుట్టూరా విశాలమైన ప్రపంచం ఉన్నదన్న విషయం వీళ్ళకు స్ఫురించవలసింది! అలాంటి ఆలోచనైనా లేకుండా వీళ్ళిలా ఇంత నిశ్చింతగా ఎలా బ్రతక గలగుతున్నారో నా కర్థం గాదు. అది నీ బోటి విజ్ఞుడు నా బోటి అనుభవంలేని వాడికి విప్పి చెప్పవలసిన రహస్యం....."

ఆ రహస్యం మాట కేమిగానీ ఈ ఉపోద్ఘాత మంతా దేనికి ఎత్తుగడో నా కర్థమై చావడం లేదు–

"చూడవయ్యా శ్రీహరీ! కష్ట సుఖాలుగానీ, ఖేదామోదాలుగానీ అనుభవంలో లేవనీ, అనుభవించేవాడి మనసులోనే ఉంటాయని పెద్దలంటారు. ఒకడికి దేశాలు తిరగడం

ఆనందమైతే, మరొకడికి హాయిగా ఇంటి పట్టున కాలం వెళ్ళబుచ్చడమే ఆనందం! ఈ మానసికమైన కారణాన్ని అటుంచి లౌకిక దృష్టితో చూచిన దేశం తిరగడమనేది అందరికీ వీలయ్యే పనిగాదు. పచ్చిక బీడులో గూటానికీ గట్టిగా కట్టివేయబడిన ఎద్దు నెప్పుడైనా చూచినావా శ్రీహరీ! అది తన పగ్గాలు అనుమతించిన పరిమిత వలయంలో మాత్రమే తిరగ గల్గుతుంది. అంతకుమించి ఓ అంగుళమైనా జరగడం దానితరం గాదు. ఇంకా నీ సంగతి చెప్పు! దేశాలు తిరగదలచుకుంటే నిన్నడ్డుకునే పరిస్థితు లేవీ లేవు. పైగా అందుకిదే తగిన అదును గూడా! పూర్వం పట్టాభిషిక్తులు గావడానికి మునుపు రాకుమారులు దేశాటనం చేసి వచ్చేవారని ప్రతీతి. నువ్వా ఆ పని చేయవచ్చు...."

"నిజమే, నిజమే!" తన అంతరంగంలోని ఊహను పసిగట్ట గలిగినందుకు నన్ను అభినందిస్తున్న వాడిలా అన్నాడు శ్రీహరి. "కానీ యువరాజులు ఒంటరిగా దేశ సంచారాలు సలిపినట్టు నిదర్శనాలు లేవు! వెన్నంటి ఓ వేడుక చెలికాడు ఉండాలి గదా!"

"ఆ స్థానాన్ని నా కివ్వ దలచుకున్నావా ఏమిటి?" విస్మయంతో ప్రశ్నించాను.

"అబ్బే! నువ్వు వేడుక చెలికాడిక్రింద జమ కట్టదగిన వాడివా శేఖరం! నా కన్నా పెద్దవాడివి. జీవితాన్ని గురించి ఎన్నో విషయాలు తెలిసినవాడివి. కొత్త ప్రదేశాల్లో, కొత్త వ్యక్తుల మధ్య మెలగుతున్నప్పుడు అనేక విషయాలకు వివరణలు, వ్యాఖ్యలు అవసరం గావచ్చు. అలాంటి పరిస్థితుల్లో నేను నీలాంటివాడి సాహచర్యాన్ని అభిలషించడంలో ఆశ్చర్యమేముంది?"

ఎలాగైనా సునిశితమైన మేధస్సు శ్రీహరిది! అతడు ఒక క్షణంలో ఎదుటి మనిషిని కించపరచనూ గలడు. మరుక్షణంలో అంచెలంచెలుగా ఆకాశానికి ఎత్తనూ గలడు.

"ఇంతకూ నువ్వు తలపెట్టిన పయనానికి గమ్యస్థాన మేదో చెబుతావా శ్రీహరీ!"

"అదే సమస్య! ఏడెనిమిది రోజులుగా నే నాలోచిస్తున్న విషయం గూడా అదే! తీరా ఒక చోటకు వెళ్ళిన తర్వాత, వేరొక చోటకు వెళ్ళి ఉంటే మరింత బాగుండేది కదా అన్న అసంతృప్తి మనల్ని వెంటాడుతుందేమోనని నా భయం! పోనీ, నీ అభిప్రాయం చెప్పరాదా శేఖరం!"

నాదేముంది శ్రీహరీ! పిండికొద్దీ రొట్టె శ్రీమంతుల్లో కొందరు ఉదక మండలాలకు వెళ్తారు. మరికొందరు బెంగుళూరు ఎన్నుకుంటారు. ఆపదమ్రొక్కులకైనా, ఆనందంగా విహరించడానికైనా అనువైన, యాత్రాస్థలం తిరుపతి– అందుబాటులోవున్న పుణ్యక్షేత్రం. పోనీ శిథిలాలు చూడదలచుకుంటే హంపీ వెళ్ళొచ్చు. సముద్ర సౌందర్య విలోకించాలనుకుంటే మహాబలిపురం...."

సముద్రాలు, నగరాలు, శిథిలాలు మన కెందుకులే శేఖరం! అవన్నీ జీవిత పటానికి చివరి అంచులు. నిజమైన జీవిత దృశ్యాలు కావాలి మనకు. పైగా వెళ్ళినచోట మన అవసరాలను మనమే గమనించుకోవలసిన దురవస్థ మనకు పట్టగూడదు! ఎందుకంటావేమో! అలాంటి బాదరబందీలన్నీ యాత్రానందానికి ఆటంకాలు...."

గడ్డు కోరికే మరి! ఏదైనా విదేశ ప్రభుత్వం ఆహ్వానం పంపితే చెప్పలేనుగానీ లేకుంటే అలాంటి సౌకర్యాలు సమకూరడం దుర్లభం!

"అదేమిటి శేఖరం! మునుపటి కొక ఈగ ఇల్లలుకుతూ తన పేరు మరచి పోయిందట! అలాగే ఉంది నీ ధోరణి. కాకపోతే పట్టణాలను గురించి, శిథిలాలను గురించి ప్రస్తావించిన వాడివి నువ్వు పల్లెటూళ్ళను గురించి మరచి పోవడ మేమిటి? భారతదేశం యొక్క నిజ స్వరూపాన్ని చూడదలచుకుంటే పల్లె సీమల్లోనే చూడాలి. రమణీయమైన తోటలు, పచ్చని శాలువా పరిచి నట్టుండే పైరు పచ్చలు. కొండ కొలకులు అబ్బో చూడ నేర్చిన కళ్ళుండాలంతేగానీ, నిండైన ప్రకృతి సౌందర్యమంతా అక్కడే ఉంది...."

"కానీ వెళ్ళిన ప్రతి పల్లెలోనూ ఆతిథ్యాన్ని ఆశించడానికిగానీ పొందడానికిగానీ మనమేమైనా రాజకీయ నాయకులమా శ్రీహరీ!"

"కాకపోవచ్చు! కానీ మనం అతిధ్యం లభించే పల్లెలకే వెళ్తాము. తరిగొండలో సుధాకరం ఉన్నాడు. గుర్రాల మహల్లో గోపాలమున్నాడు. తిమ్మసముద్రంలో కేశవులున్నాడు. వీళ్ళంతా ఎవరో ననుకునేవు! ఆత్మీయులైన మిత్రులు. కాలేజీలో నా సహపాఠకులు...."

"కానీ అల్లుడితో బాటుగా గిల్లుడు గూడా అవసరమా శ్రీహరీ!"

"అబ్బే, నువ్వలాంటి సందేహాలు పెట్టుకోవద్దు శేఖరం! నా మూలంగా నీలాంటి స్నేహితుడు దొరికితే వాళ్లెంతగానో సంతోషిస్తారు. తరిగొండలో సుధాకర మున్నాడన్నాను కదూ! వాడూ నాలాగే తండ్రి కొక్కడే కొడుకు. వాళ్ళ నూరెకరాల మాగాణిలో నాసిరకం వడ్లు పండవు. కిచ్చిలి సంబావులు, బంగారు తీగలు, రాజనాలు పండుతాయి. రెండు మూడేళ్ళపాటు పాతరలో పోసి ఉంచిన పాత వడ్ల బియ్యాన్ని కానీ వాళ్ళు వాడరు. ప్రతిరోజూ బెంగుళూరునుంచీ వాళ్ళయింటికి కూరగాయల బుట్ట వస్తుంది. ఇది మామిడి పళ్ళ కాలం గదూ! తరిగొండ మామిడి పళ్ళంటే బొంబాయి దాకా ప్రసిద్ధి. ఇంత చెప్పీ, పాడి సంగతి చెప్పాను కాను. ఒక్కమాటలో చెప్పొచ్చు. వాళ్ళ ఇంటి కాకి గూడా నేతి వంటకమైతేగానీ రుచిచూడదు....."

ఇళ్ళల్లో కుక్కల్ని పెంచడం రివాజు! కాకుల్ని గూడా పెంచడమన్నది అసలు సిసలు తాజా వార్త. ప్రసంగ సౌలభ్యం కోసం సామెతలను నుడికారాలను ఎవడిష్టం వచ్చినట్లు వాడు సర్దుకోవచ్చు అభ్యంతరంలేదు. కానీ నే నాశ్చర్యపడటం అందుకు కాదు. శ్రీహరి ఎదుటి వ్యక్తిని భోజన ప్రియుణ్ణిగా ఊహించి, వాడిలోని భోజన ప్రియత్వాన్ని రెచ్చగొట్టే ప్రయత్నంలో ఉన్నాడు!

"చూడు శ్రీహరీ! పెద్దలు ప్రపంచంలోని జనాభాను రెండు రకాలుగా వర్గీకరించారు. బ్రతకడానికే తినేవాళ్లు కొందరు. తినడానికే బ్రతికే వాళ్లు మరికొందరు. పై రెండు తెగల్లో నన్ను నీ తెగకు చెందిన వాణ్ణిగా తలపోస్తున్నావు నువ్వు?"

శ్రీహరి తెల్లబోయినట్టు కనిపించాడు. కానీ అంతలో తేరుకుని, "అదేమిటి శేఖరం! నా మాటల్లో లేనిపోని భావాన్ని దేన్నో నువ్వు పైకి లాగజూస్తున్నావు" అంటూ తప్పించుకోజూచాడు.

"కాదులే శ్రీహరీ! మానవుడికి ప్రాణశక్తి నిస్తున్న అన్నం పట్ల ఏవో దురూహ లున్నట్టున్నాయి నీకు! ప్రియంగా భోజనం చేసేవాళ్లు నీ కంటికి తిండికోసం కక్కుర్తి పడే వాళ్ళల్లా కనిపిస్తారు. నన్నడిగితే బాగా భోజనం చేయడం ఆరోగ్యానికి చిహ్నం. భోజనాన్ని చూడగానే మోహం మొత్తినట్టుండడం అనారోగ్యానికి గుర్తు! నీకు ఆరోగ్యమంటే ఏమిటో తెలుసు. దానికంటే మహాభాగ్యం లేదని ఏ కుర్రకుంక నడిగినా చెబుతాడు...."

"అబ్బబ్బ" దులిపేశావయ్యా శేఖరం! పోనీలే బాబూ! నాది పొరపాటే ననుకో! ఐనా తినబోతుండగా రుచుల్ని గురించి చెప్పడమెందుకు? ఎప్పుడు బయల్దేరుదామో చెప్పు..."

"ఆ నిర్ణయాన్ని మాత్రం నువ్వు నాకు వదిలి పెడతావా శ్రీహరీ! ఈ పాటి కదీ నీ బుర్రలో తయారయ్యే ఉంటుంది" అన్నాను.

"అయితే ఎప్పుడో ఎందుకు! రేపుదయాన్నే బయల్దేరుదాం, ఆరు గంటలకల్లా నువ్వు సిద్ధంగా ఉంటే చాలు...."

"ఆవేళప్పుడు బస్సులు లేవే!"

"బస్సా! బస్సెందుకు? లక్షణంగా కారుండగా మనం బస్సుల్లో వెళ్తామా శేఖరం!"

కారా! ఆ కారు.... నిర్ఘాంతపడిపోయాను నేను.

శ్రీహరి తండ్రి పెదబాబుగారికి కారు కొనాలన్న ఉద్దేశం ఏ కోశానా ఉండేదిగాదు. కానీ సన్నిహితులైన బంధువులు కొందరు సంపన్నులకుండ వలసిన హంగుల్లో కారొక్కటి అని చెవిలో ఇల్లుగట్టుకుని పోరడంతో ఆయన ఆ కారును కొని తీసుకొచ్చేశారు. తీసుకొచ్చారేగాని, అలా తీసుకరావడంలో కారులాంటి ఆకారం గలిగిన దొకటి ఇంటి

దగ్గర పడి ఉంటే చాలునన్న ఉద్దేశమే తప్పా, అది ఎప్పుడంటే అప్పుడు పరిగెత్తి తీరాలన్న కోరిక ఆయన కున్నట్టులేదు. నాలుగు చక్రాలు, పై కప్పు, లోపల ఆసనాలు, వాటి ముందు స్టీరింగు చక్రం, దాని కివతల ఇంజను లాంటివన్నీ వాటి వాటి యథాస్థానాల్లో వున్న మాట నిజమే. కానీ వాటిల్లో ఏది ఎప్పుడు మిగిలిన భాగాలతో సహాయ నిరాకరణ ప్రారంభిస్తుందో ఊహించడం కష్టం. తన ఇబ్బందులు తన కెన్ని ఉన్నా, అప్పుడప్పుడూ పరుగెత్తగలగడమే దాని ప్రత్యేకత. సెలవుల్లో ఇంటి కొచ్చిన శ్రీహరి అలనా పాలనా లేక పడి ఉన్న ఆ కారుపై తన ధ్యాసను కేంద్రీకరించాడు. తీసుకెళ్ళి మరమ్మత్తుల కార్ఖానాలో చేర్పించి సాంగోపాంగంగా కాయ కల్ప చికిత్స జరిపించి దట్టంగా రంగుపూయించి దాని ఆకృతిలో మార్పు తీసుకురావడంలో కృత కృత్యుడు కాగలిగాడు. వన్య మృగాన్ని మచ్చిక చేసుకుంటున్నట్టుగా ఎప్పుడు వెళ్ళి చూచినా ఆ కారుపైన అతడేవో సాధనలు చేస్తుండేవాడు. రకరకాల ఉపాసనలతో క్షుద్ర దేవతలను ప్రసన్నం చేసుకునే మాంత్రికుడికి మల్లే తన నిర్విరామ కృషితో శ్రీహరి ఆ కారును కొంతవరకూ తన అదుపులోకి తెచ్చుకో గలిగాడు. డబ్బా రేకుల పైన రోళ్ళ వాన పడినట్టుగా శబ్దం వినిపించినప్పుడల్లా అదిగో పెద్దబాబుగారి కారు అంటూ కుర్రవాళ్ళు వీధుల్లోకి రావడం ఇటీవలి పరిణామాల్లో ఒకటి. తన స్వభావానికి విరుద్ధంగా అది ఇలా పరుగులు ప్రారంభించిన తర్వాత ఊళ్లోకోళ్ళకు, కుక్కలకు రక్షణ లేకపోయింది. ఒకటి రెండుసార్లది దారి ప్రక్కన నిల్చున్న కుర్రాళ్ళ పైకి గూడా వెళ్ళబోయి, అంతలో ఎందుకో దయదలచి వదలి పెట్టింది. పెద్దబాబుగారి కారు. చిన బాబుగారి సారధ్యం. చిన్న చిన్న ప్రమాదాలు జరిగితే జరిగాయి లెమ్మనుకుని గ్రామస్తులు సరకుచేశారు కారు.

ఆ కారులో తరిగొండకు గుర్రాల మహలుకు బయల్దేరుదా మంటున్నాడు శ్రీహరి. దీన్నతుడు ఒక సాహసకృత్యంగా భావిస్తున్నాడేమో గూడా! ఇంతకంటే డాన్క్విక్‌సాట్ నయం! అతడి బక్కగుర్రం మార్గ మధ్యంలో చనిపోతే చనిపోవచ్చు. అంతేగానీ బ్రతికిందా చనిపోయిందా అని వితర్కించుకోవలసిన అవసరం అతని కేర్పడి ఉండదు!

◆ ◆ ◆

రథం కదిలింది.

ఉదయం ఎనిమిది గంటలవేళ కొండకోనల పై నుంచీ చల్లటి గాలి వీస్తోంది. ఏపుగా పెరిగి ఏటవాలుగా క్రిందికి వ్రాలి అలలు అలలుగా కదిలి పోతున్న వరిపైరు పైన నీరెండ మిల మిలలాడుతోంది. ఆవేళప్పుడు వాతావరణం ప్రశాంతంగా ఆహ్లాదకరంగా

ఉండడం సహజమే! కానీ కారు ఇంటి దగ్గర బయల్దేరి నప్పటినుంచీ పరుగెడుతూ ఉండడమే విచిత్రం! అది బహుశా శ్రీహరి దగ్గరి నుంచీ ఎంతో కొంత ఆత్మ విశ్వాసాన్ని అరువు పుచ్చుకున్నదేమో తెలియడం లేదు.

సైకిళ్ళు త్రొక్కడం దగ్గరినుంచీ మొదలు పెట్టి, విమానాల్ని నడిపించేదాకా వివిధ శకటాల సారథ్యంలో సారథికి ఎదురయ్యే చిక్కుల్ని గురించి చెబుతున్నాడు శ్రీహరి. తంతి కంబాలకు ఢీకొని ముక్కలైన సైకిళ్లు, చెట్లకు మోదుకుని తల క్రిందులైన లారీలు, సముద్రంలో బుడుంగుమని మునక వేసిన ఓడలు, పల్టీలు కొడుతూ భూపతనమైన విమానాలు మున్నగు దృశ్యాలను కళ్ళకు గట్టినట్టుగా వర్ణిస్తున్నాడు శ్రీహరి. పరుగెడుత్తున్న కారులో గనుక కూర్చోకపోతే అలాంటి ప్రసంగాన్ని ఎంతసేపైనా విని ఆనందించవచ్చు! ఇదివర కెవరికో తటస్థించిన ప్రమాదాల కంటే ఈ క్షణాన్నో మరుక్షణాన్నో మనకు ఎదురుకానున్న అపాయం వెయ్యి రెట్లు దారుణమైనది! ఈ వాస్తవం శ్రీహరికి లీలామాత్రంగానైనా స్ఫురించినట్టు లేదు!

"పోనీలే శ్రీహరీ! ఫర్లాంగుకు నాలుగుచోట్ల వంకరలు తిరుగుతున్న రోడ్డిది. నువ్వు కాస్తా రోడ్డు పైకి చూస్తూ రథం తోలు" అన్నాను.

శ్రీహరి గొల్లున నవ్వేశాడు– "అలాగైతే నీకో విశేషం చెప్పాల్సిందే! ఏం జరిగిందో తెలుసా శేఖరం! విదేశీయుడొక్కడు కళ్ళకు గంతలు కట్టుకుని కారు నడిపేశాడు. అదీ మదరాసు మహానగర వీధుల్లో!

"కావచ్చు. మట్టి గుర్రంపైన కూర్చుని మహా నదిని దాటడం మహానుభావులకే సాధ్యం! అలాగని అందరూ వాళ్ళని అనుకరించడం ఏమంత మంచిది?"

కారు డ్రయివింగులో తన నేర్పరి తనాన్ని శంకించినందుకు శ్రీహరికి నాపైన ఇంచుక కోపమే వచ్చింది. "ప్రాణాలపైన తీపి నీ కొక్కడికేనా శేఖరం! ప్రాణాలు అంత నిర్లక్ష్యంగా త్యజింప దగినవి కావని నాకూ తెలుసు! నీ కెందుకూ, నువ్వు నిశ్చింతగా కూర్చో! సురక్షితంగా గమ్యస్థానం చేర్చే బాధ్యత నాది....."

చెప్పడమేగాదు. చెప్పిన మాటను నిలబెట్టుకున్నాడు శ్రీహరి. గమ్యస్థానం చేరువలో ఉండగా మదిలో ఓ సాంప్రదాయికమైన ఊహ మెదిలింది. బయల్దేరిన వేళా విశేషం మంచిదేమో! మనసులో ఉంచుకోలేక ఆ మాట పైకనేశాను. శ్రీహరి కీసారి కాస్త ఎక్కువ మోతాదులోనే వచ్చింది కోపం! "చివరంటా వచ్చేశాము గనుక అందుకు కారణం బయల్దేరిన వేళా విశేషం! మధ్యలో ఆగిపోయి ఉంటే అందుకు కారణం నా అసమర్థత! చూడు శేఖరం! నువ్వు ఉపాధ్యాయుడివి! నీపైన నమ్మకంలేని శిష్యుడికి నువ్వేంపాఠం బోధించగలవు? అలాగే ప్రయాణీకుడికి గూడా డ్రయివరుపైన నమ్మకం ఉండాలి...."

నిజమే! నమ్మి చెడినవారు లేరు, నమ్మక చెడిపోయ్యేరు- అంటూ బైరాగులు పాడుతుంటే అంతరార్థం తెలిసిందిగాదు. ఇప్పుడు శ్రీహరి వ్యాఖ్యానం మూలంగా తత్వం బోధపడింది.

పైరు పచ్చనచేత, వాటికి వెనుక మామిడి తోపులచేత, ఆ పిమ్మట పచ్చటి కొండలచేత పరివేష్ఠింపబడి మిగిలిన ప్రపంచంనుంచీ దూరంగా విసరి వేయబడినట్టున్న చిన్న పల్లెటూరు తరిగొండ. అలాంటి పల్లెలో సెలవు రోజులు గడుపుతున్న కాలేజీ విద్యార్థికి మిత్ర సమాగమం అత్యంతానందదాయకం గావడంలో ఆశ్చర్యంలేదు. సుధాకరం గాలి కొట్టిన బెలూనులా ఆనందంతో బూరటించిపోయాడు. మిత్రుడెక్కి వచ్చిన పాత కారు అతడి కళ్ళకు పుష్పక విమానంలా గోచరించింది.

"రండి రండి. అబ్బే, ఇక్కడెందుకు? పై కే వెళ్ళడం బాగుంటుంది. ప్రయాణంలో బాగా అలసిపోయి వచ్చారు. మొదట స్నానం చేస్తారా శ్రీహరీ! పోనీ, కాఫీ తీసుకోగూడదూ..."

"భోజనాల వేళప్పుడు ఇప్పుడు కాఫీ ఎందుకు" అన్నాను.

నా మాటకు బదులు చెప్పడాని కక్కడ సుధాకరం లేదు. ఏవో పురమాయింపుల కోసం అతడు క్రిందికి వెళ్ళాడు. స్నేహితుడి బాధ్యతను శ్రీహరి తానే స్వీకరించాడు-

"భోజనాలకు గూడా ఢోకా ఉండదు" అన్నాడతడు వీలైనంత అమాయికంగా ముఖం పెట్టి!

"అప్పటికది నీపాలిటికి బొత్తిగా పనికిరాని వస్తువా శ్రీహరి!" నేనూ వీలైనంత అమాయికంగానే ప్రశ్నించాను.

అంతలో మళ్ళీ సుధాకరం ప్రత్యక్షం శుభ వార్తలతో సహా! శుభ వార్తల్లో మొదటిది వేడినీళ్ళు సిద్ధంగా ఉన్నాయి. రెండోది కాఫీ తయారౌతోంది.

"వీరిని పరిచయం చేశావు కావే" అన్నాడు సుధాకరం.

"వీరే రాజశేఖరంగారూ! చదువుకున్నవారు. చదువు చెబుతున్నవారు...."

"అలాగా! నమస్కారమండి రాజశేఖరంగారూ! శ్రీహరి మిమ్మల్ని గురించి మాటి మాటికి చెబుతుండేవాడు. అన్నట్టు ఎండలోపడి వచ్చారు. మొదట చల్లగా మంచి నీళ్ల పుచ్చుకుంటారా శ్రీహరీ!"

మంచి నీళ్ళకోసం మళ్ళీ ఎక్కినంత దూరం క్రిందికి దిగీ వెళ్లేవాడే సుధాకరం. అంతలో పొగలెగసే కాఫీ పానీయమే పైకి వచ్చేసింది.

కాఫీ తీసుకోమని చెప్పి చరాలున పైకి లేచాడు సుధాకరం! "ఇప్పుడే వస్తాను. శ్రీహరీ! మరేం లేదు. వంట మనిషికో మాట చెప్పాలి...." అంటూ తుర్రున మాయమై పోయాడు.

కాఫీ బాగుంది. నింపాదిగా సేవించాను. శ్రీహరి కప్పులో కాఫీ ద్రవపు మట్టం ఒకటి రెండు సెంటిమీటర్లకంటే తగ్గినట్టు లేదు. కప్పు నలాగే పళ్లెంలోవుంచి అతడు పరధ్యానంగా పై కప్పు వంక చూస్తున్నాడు.

"కాఫీ చల్లారి పోతోంది శ్రీహరి!" అన్నాను. పోనీ లెమ్మనట్టు పెదవి విరిచి నాలుక చప్పరించి చిత్రమైన హావ భావాన్ని ప్రదర్శించాడు శ్రీహరి.

"అంటే?" అతడి ఉద్దేశం అర్థమైంది గాదు.

"వచ్చిన వాళ్ళకు కాఫీ ఇవ్వడం మర్యాద. వద్దనకుండా పుచ్చుకుంటే చాలు. అంతా త్రాగేయాలన్న నిర్బంధ మేముంది?"

"నిర్బంధం లేకపోవచ్చు. కానీ ఇంత దూరం అలసి సొలసి వచ్చాంగదా శ్రీహరి! సేద దీరడానికి ద్రవాహారంలాంటి దేదైనా పుచ్చుకోవలసిన అవసరమైనా లేదంటావా?"

"అబ్బే ఇదేం కాఫీ లేవయ్యా శేఖరం! త్రాగితే హోటలు భవానీలోనే తాగాలి కాఫీ!"

హోటలు భవాని! ఎక్కడుందది? అజ్ఞానాన్ని ప్రదర్శించడ మెందుకని ప్రశ్నించడం మానుకున్నాను.

కాఫీ దగ్గర మాత్రమేగాదు, భోజనాల దగ్గర గూడా విచిత్రంగానే ప్రవర్తించాడు శ్రీహరి! హోమధూమంతో దేవతల ఆకలి తీరిపోయినట్టు, భోజనం వైపు చూడడంతో శ్రీహరికి ఆకలి ఉపశమిస్తున్న దేమోనని అనుకోవలసి వచ్చింది. లేదంటే ఆకులో వడ్డించిన అన్నాన్ని అటూ, ఇటూ కెలికి తిన్న శాస్త్రం ముగిస్తాడు. ఎంత కావాలో అంతే పెట్టించుకోవడం, పెట్టించుకున్నదంతా వదిలి పెట్టకుండా తినేయడం, భోజన విషయకమైన మంచి అలవాట్లలో ఒకటి. పొదుపును గురించి ఇంతగా పట్టింపులేని పాతకాలపు రోజుల్లో మా తాతగారు ఓ మాట చెబుతుండేవారు. ఆకులో మెతుకు వదిలి పెడితే ఏడు రోజులు పస్తుపడి ఉండవలసి వస్తుందట! ఏదో ఛాదస్తం లెమ్మని కుర్రవాళ్ళు ఆ సలహాను పాటించకపోతే "తిండిని తేలికగా చూడకండ్రా బాబులూ కూడు గుండెకాయ, మెతుకు మేనమామ అయ్యే రోజులొస్తాయిలే" అనే వాడాయన. ప్రపంచంలో పెరుగుతున్న జనాభా, తిండి గింజల కొరత, కాలక్రమాన భౌతిక సంపదలు తరిగి పోగలవని విజ్ఞాన వేత్తలు చేస్తున్న సూచన మున్నగు విషయాల్లోనుంచీ తాతయ్య హెచ్చరికను గురించి ఆలోచిస్తే, అందులో ఎంతైనా నిజం ఉన్నదేమోననిపిస్తుంది.

అన్నానికి అనుపానంగా వడ్డించే ఫలహారాలు, పళ్ళ దినుసులు సైతం శ్రీహరి జిహ్వకు రుచిస్తున్న సూచనలు లేవు. రామార్పితం చేయబోతున్న పళ్ళను శబరి కొరకి చూచినట్టు, మాగిందా లేదా అన్న సందేహంతో చిలుక మామిడి పండును పొడిచి చూచినట్టు శ్రీహరి మునిపంటితో తినుబండారాలను పరామర్శిస్తాడు. పోనీ, ఏదో కారణం వల్ల శ్రీహరికి భోజనం రుచించడం లేదనే అనుకుందాం! అంతటితో ఊరుకోవచ్చు గదా! ఊరుకోడు శ్రీహరి. "సాంబారుకు ఫలనా హోటలు ప్రసిద్ధి. సాంబారు భోజనం అక్కడే చేయాలి" అంటాడు. తేనీటికి పేరెన్నికగన్న దానిగా ఓ హోటలును పేర్కొని, ఈ భూ ప్రపంచంలో వేరొకచోట తేనీరు సేవించడం శుష్కదండుగే నంటాడు.

"పైకి చూడ్డానికేమో బాగానే ఉన్నావుగానీ, నీ కడుపులో జఠరాగ్ని గాఢ నిద్రలో ఉన్నట్టుందిరా శ్రీహరి!" ఉండి ఉండి సుధాకరం తన అభిప్రాయం వెలిబుచ్చాడు.

(అతడి పుణ్యం! జఠరాగ్ని దీర్ఘ నిద్రలో ఉన్నట్టు చెప్పాడుకాదు!')

"అందుకు మా అమ్మ చక్కటి కారణం చెబుతుంది. అదేమిటో చెప్పనా సుధాకరం! ఎవరివో పాపిష్టి కళ్ళు భోజనం చేస్తుండగా నాపైన పడ్డాయట! అప్పటినుంచీ నాకు తిండి దిగడం లేదట! దృష్టి దోష నివారణకోసం ఆమె వాడి చూడని మంత్ర తంత్రాలు లేవు....."

ఆ మాట నిజమే! శ్రీహరి తల్లి పేరు అన్నపూర్ణమ్మ. ఆమెది అన్వర్థ నామధేయం. ఎటొచ్చీ ఆమె కొకటే చింత– కుమారుడు సరిగ్గా అన్నం తినడని!

ఆ చింత తాత్కాలికంగా సుధాకరాన్ని చుట్టు ముట్టింది. శ్రీహరికి సంతృప్తికరమైన భోజనం పెట్టడానికి సుధాకరం శాయ శక్తులా ప్రయత్నించాడు. చిత్రాన్నం, చక్కెర పొంగలి, గారెలు, బూరెలు, జిలేబీ, కేసరి లాంటి వంటకాలు చేయించి, అవి మిత్రుడి జిహ్వపైన తమ ప్రభావాన్ని నెరపగలవేమోనని ఆశ పడ్డాడు. ఎంతగా ప్రయత్నించినా అతడి ఆశ అడియాసే అయింది.

"లాభం లేదురా అబ్బీ! అన్నహితవు అనేది భగవంతుడు నీ నుదుట వ్రాసి పెట్టిన వ్రాతగాదు" అంటూ వేడిగా నిట్టూర్చాడు సుధాకరం.

◆ ◆ ◆

రెండో మజిలీకి ప్రయాణం.

పుచ్చపువ్వులాంటి వెన్నెల్లో ప్రయాణం చేయడమంటే చెప్పరానంత సరదా శ్రీహరికి! తరిగొండలో కారు బయల్దేరినప్పుడు గంట అయిదున్నర కావస్తోంది. మెల్లగా పది

మైళ్ళు వెళ్లేసరికి సూర్యుడస్తమించాడు. గృహోన్ముఖంగా పరుగెడుతున్న ఆలమందలు పెక్కుచోట్ల కారు కడ్డంగా వచ్చాయి. బారులు గట్టిన పక్షుల గుంపులు గూళ్ళ కెగిరి పోతున్నాయి. చూస్తుండగానే చీకటి పడింది. ఇక వెన్నెల రావడమే తరువాయి! కారు పరుగెడుతోంది. ఎంతసేపు వేచి చూచినా పరిసర గిరులపైన గానీ, వెన్నెల వెలుగులు తారాడటం లేదు. వెన్నెలకు బదులుగా తెల్లటి బ్లాటింగ్ పేపరుపైన ఒలికిన నల్లటి సిరాలా చీకటి మరింత దట్టమై పోతోంది. కిటికీలోనుంచీ తల వెలుపలికి సాచి ఆకసం వైపు చూచాను. వెన్నెల మాట దేవుడెరగు! రోడ్డుకు తూర్పుగా ఉన్న కొండల పైన అల్లరి పిల్లల్లా ఆడుకుంటూ ఉండిన నాలుగైదు మేఘ శకలాలు కబంధుడిలా హస్తాలు చాచి దిశాంచలాల దాకా విస్తరించాయి.

"తొందరగా వెళ్ళడం మంచిది శ్రీహరీ!" అన్నాను.

"ఎందుకూ!" అన్నట్టు తిరిగి చూచాడు శ్రీహరి.

"వెన్నెల రాదు. వాన వచ్చినా రావచ్చు...."

"మరేం పరవాలేదు. మొన్ననే టాపు గూడా రిపేరు చేయించాను. ఎంత వానపడినా చుక్కలోపలికి దిగదు."

ఆమాత్రం రక్షణను నమ్ముకుని శ్రీహరి నిశ్చింతగా ఉండగలగడం నా మట్టుకు నాకు అబ్బురాన్నే కలిగించిది. జడివాన ప్రారంభమై చీకటి కమ్ముకుంటే అప్పుడీ కారు చిన్న చెరసాలకంటే ఎక్కువగా ఉపకరించదు. గట్టిగా వాన కురిసి రోడ్డు చిత్తడిగా తయారైతే కారు ముందుకు కదులుతుందో, కదలదో సందేహం. కొండల్లో నుంచి ఉరవడిగా క్రిందికి దూకి రోడ్డు కడ్డంగా పరుగెడుతున్న సెలయేళ్ళపైన వంతెనలు లేవు. ఇవన్నీ ప్రయాణానికున్న ఇబ్బందులైతే, ప్రయాణ సాధనం యొక్క వాలకం సైతం ఏమంత ఆశావహంగా లేదు. ఏదో తికమక ప్రారంభమై వేగం మందగించింది. కందిరీగల రొదలాంటి సవ్వడి ఒకటి. ఇంజనులోనుంచి ఎడతెరిపి లేకుండా వినిపిస్తోంది. ఒంటి చక్రపు తేరికి ఏడు గుర్రాలు పూన్చి కుంటిసారథిని నమ్ముకుని ఆకాశ మార్గంలో పయనమైన సూర్యభగవానుడిలా కష్ట నిష్టురాల మాట లెక్క పెట్టకుండా కారు నడుపుకపోతున్న శ్రీహరిని లోలోపల అభినందించకుండా ఉండలేకపోయాను.

ఆఖరుకు అనుకున్నంతా జరిగింది. అంటే వాన ప్రారంభమైందని గాదు. కారే ఆగిపోయింది.

ఎండిపోయిన సెలయేటి ఇసుకపైన ఆగిపోయింది కారు. ఎట్ట ఎదుట ఫర్లాంగు దూరందాకా పైకి లేచి మటిలు దిబ్బలా కనిపిస్తున్న రోడ్డు చుట్టూరా చెట్టడివి. తటాలున

కారులో నుంచీ వెలుపలికి దూకాడు శ్రీహరి. సీటు క్రింద నుంచీ టార్చి లైటు పైకి తీశాడు. మేఘాల పైన మెరుస్తున్న మెరుపులతో బాటుగా టార్చిలైటు వెలిగింది. ఆ వెలుగులో శ్రీహరి మూత పైకెత్తి ఇంజనులోని వివిధ భాగాలను జాగ్రత్తగా పరిశీలింపసాగాడు. ఇంజనులోని మరలూ, మేకులూ, కమ్ములూ, గొట్టాలు అన్నీ పదిలంగానే ఉన్నాయి. కారు పరుగెడుతున్నప్పుడు అది పరుగెత్తడానికి ఉపకరించిన ఇంజనే ఇది! కానీ ఇప్పుడది ఆగిపోయింది. ఎందుకు ఆగిపోయిందో తెలియదు. నాకు తెలియని విషయం అదొక్కటే గాదు. చెడిపోయిన ఇంజన్ను శ్రీహరి అప్పటికప్పుడు మరమ్మత్తు చేయగలడా, లేదా అన్న విషయం గూడా నాకు నిష్కర్షగా తెలియదు.

పది పదిహేను నిమిషాల వరకూ అలా పరిశీలన కొనసాగిన తరువాత శ్రీహరి చొక్కా తీసి కారు లోపలికి గిరవాటుపెట్టి ఇసుకలో వెల్లకిలపడుకుని తలను కారు క్రిందికి దూర్చుతూ "నువ్వు కాస్త క్రిందికి వంగి లైటు వేస్తావా శేఖరం! స్ప్రింగేదైనా విరిగిపోయిందేమో చూడాలి" అన్నాడు.

లైటు వేశాను. విరిగిపోయిన స్ప్రింగు మాట ఏమోగానీ, శ్రీహరి మంధరగిరిని పైకి లేపిన ఆది కూర్మంలా కారును లేవనెత్త నుంకిస్తున్నాడు. ఆ ప్రయత్నంలో బలాన్నంతా చేతుల్లోకి తెచ్చుకోడంలో అతడి శరీరం విలవిలలాడిపోతోంది, నిర్జన ప్రదేశంలో కారాగిపోయి రాత్రంతా అక్కడే జాగరణ సలపవలసివస్తే మిత్రుడి ఎదుట తన అభిమానానికి దెబ్బ తగులుతుందనుకున్నాడేమో, కారు నెలాగైనా కదిలించాలన్న మొండి పట్టుదలకు లోనయ్యాడు. శ్రీహరి.

కారు బరువు క్రింద శరీరాన్ని అలా చిత్తు చిత్తు చేసుకోడంవల్ల లాభం లేదని గ్రహించిన తరువాత శ్రీహరి చేసేదిలేక ఇసుకలో చతికిల బడిపోయాడు. "ఎంత పని జరిగిందో చూచావా శేఖరం! ఇలా జరుగుతుందని తెలిస్తే అసలు తరిగొండనుంచీ కదిలే వాళ్ళమేకాము... కొలిమి తిత్తిలా రొప్పుతున్న ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో శ్రీహరి మాట్లాడలేక పోయాడు. అతడి ముఖం చెమటలో దొప్ప దోగిపోతోంది. దుస్తులు స్వేదంలో తడిసి శరీరాని కంటుకపోయాయి.

ఘీంకారాల్లాంటి ఉరుములతో, దంతకాంతుల్లాంటి మబ్బులు విచ్చల విడిగా విహారం సలుపుతున్న విశాలాకాశం క్రింద, ఆకల్లాడక స్తంభించిపోయిన ప్రకృతి దృశ్యాల మధ్య కింకర్తవ్యతా విమూఢులమైన మా పాలిటికి కాలచక్రం ఆగిపోయినట్టే తోచింది. "పోనీలే శ్రీహరీ! జరిగిందానికి ఏం చేయగలం! గతం నశోచామి– అన్నారు పెద్దలు. విచారించి

ఏం లాభం?" అంటూ ఏవో ఓదార్పు మాటలు చెప్పి చూచాను. కానీ ఓదార్పు కతీతంగా శ్రీహరి ఖిన్నుడై కూర్చుండి పోయాడు.

చిన్న చిన్న పొదరిళ్ళు చీకటిలో గంతు లేస్తున్న క్రూర మృగల్లా కనిపిస్తున్నాయి. బీభత్స రస ప్రధానమైన నాటకానికి నేపథ్య సంగీతంలా దూరం నుంచీ అడవి మెకాల అరుపులు వినిపిస్తున్నాయి. దగ్గరలో ఏదో శబ్దం వినిపించి ఉలికిపడ్డాను. హఠాత్తుగా ఓ నిర్ణయానికి వచ్చిన వాడిలా లేచి నిల్చున్నాడు శ్రీహరి. "ఇలా మీనమేషాలు లెక్కిస్తూ ఎంతసేపని కూర్చుంటాం శేఖరం! ఎలాగైనా ఈ మిట్ట పైకి తోసుకెళ్తే పల్లంలో కారు స్టార్టయి పోవచ్చు...."

వారించి ఆ ప్రయత్నంనుంచీ విరమింపజేయడంకన్నా, ఆ అయోమయ పరిస్థితిలో శ్రీహరి సలహాను పాటించడమే నయమనిపించింది. కానీ స్వశక్తిని గుర్తించక తలకుమించిన పనులకు పూనుకోడంవల్ల భంగపాటు కాక మరేం కలుగుతుంది? ఆ కారు ఎదుట మాకు వాటిల్లింది గూడా అదే! కారును ఇసుక్‌లోనుంచీ అవతలికి నెట్టేసరికి కీళ్ళు ఎక్కడి వక్కడే విడిపోయినట్టు, ఎముకలు దేనికదే వేరైనట్టు శరీరం స్వాధీనం తప్పింది. అందులోనూ కాయ కష్టానికి అలవాటు పడిన వాడుకాదు శ్రీహరి. ఇంకెంత దూరం, కొంతదూరమే నన్న ఆశ మాత్రమే అతడిచేత ఆ కష్ట సాధ్యమైన పనిని చేయించి ఉంటుంది. విశ్వ ప్రయత్నంతో కారును మిట్టపైకి చేర వేసేసరికి శ్రీహరి బొందిలో ఊపిరున్నట్టులేదు. అతడు బల్లిలా కారు కంటుకపోయి ఒగర్చుకుంటూ "మంచి నీళ్ళ శేఖరం! గ్లాసుడు మంచినీళ్ళు దొరికితే బాగుండును" అన్నాడు.

"మంచి నీళ్ళెక్కడ దొరుకుతాయి? ఇంకావాన ప్రారంభం కాలేదు. వరుణదేవుడు అనుగ్రహిస్తే వాన నీటితో పెదవులనైనా తడుపుకోవచ్చు."

ఇంగితం తెలుసుకున్న వాడిలా వరుణదేవుడు పిలవకముందే పలికాడు. సన్నగా తుంపర ప్రారంభమైంది.

"వృథాగా వానలో తడవడ మెందుకు శ్రీహరీ! లోపల కూర్చుందాం" అన్నాను.

"కళ్ళు తిరుగుతున్నాయి శేఖరం! తలు పెక్కడుందో చూపించు" అన్నాడు శ్రీహరి.

తలుపు తెరచి లోపలికి చేర వేయడమే తరువాయి శ్రీహరి శరీరాన్ని ముదర చుట్టుకుని సీటు పైన సొమ్మసిల్లి పోయాడు.

పది పదిహేను నిమిషాలు గడిచేసరికి తుంపర జోరు హెచ్చించి వర్షంగా పర్యవసించింది. అంధకారం లోకాన్ని ఆవరించుకున్నవేళ అరణ్య ప్రాంతంల్లో జడివాన

కురుస్తుంటే చూడాలన్న కోరిక చిరకాలంనుంచీ ఉంది. భగవంతుడు ఏనాటి కే అనుభవాన్ని వ్రాసి పెట్టాడో దాని అనుభవించక తప్పించుకోడం ఎవరితరం? ఆ అనుభవంలో కష్టమే ఎదురైనా, సుఖమే ఎదురైనా నిర్లిప్తతతో స్వీకరించడం మానవుడి విధి. కారు లోపల కూర్చుని కిటికీ అద్దాలగుండా బాహ్య ప్రపంచంలోకి చూస్తున్నాను. మింటికీ, మంటికీ కాకిని వ్రేలాడగట్టి నట్టున్న గంభీర దృశ్యం ఒక్కటి తప్పితే కంటికి మరేమీ కనిపించడంలేదు. కురుస్తున్న తీరులో హెచ్చు తగ్గులనుబట్టి మద్దెలలు మ్రోగినట్టు, డమరుకాలు మ్రోయించినట్టు, నగారాలు నినదించినట్టు రకరకాల శబ్ద విన్యాసాలతో వర్షం విశ్వరంగంపైన కదను త్రొక్కుతోంది.

అర్ధరాత్రి కింక ఒకటి రెండు గడియల వ్యవధి ఉందనగా శ్రీహరిలో చైతన్యం పుట్టుకొచ్చింది. తలపైకెత్తి నా పొలకువకోసం అటూ ఇటూ చూస్తూ "ఏం చేస్తున్నావు శేఖరం!" అని ప్రశ్నించాడు.

"కూర్చునే ఉన్నాను శ్రీహరీ! వాన వెలిసింది. మేఘాలు విచ్చిపోయాయి. వెన్నెల కాస్తోంది, ప్రకృతి చాలా అందంగా ఉంది" అన్నాను.

"నీ అందాన్ని తీసుకెళ్ళి గంగలో కలపవయ్యా బాబూ! కడుపులో కొక్కులు తవ్వుతున్నాయి. పేగులు గీపెడుతున్నాయి. తినడాని  కేదైనా కావాలి. గొంతుక వెంట ఏదైనా దిగకపోతే కళ్ళు తేల వేసేయడం ఖాయం. చూడవయ్యా బాబూ! దగ్గర్లో ఏదైనా పల్లెటూరుందేమో చూడు...."

"ఈవేళ గాని వేళలో పల్లెలోనైనా ఏం దొరుకుతుంది శ్రీహరీ?"

"మరేమీ దొరక్కపోయినా గుప్పెడు వేరుశనగకాయలైనా దొరకవా శేఖరం! అవి దొరికినా చాలు...."

"కానీ ఈ అర్ధరాత్రి సమయంలో పల్లెల కోసం అన్వేషణ ప్రారంభిస్తే ఇక్కడ కారు గతి."

"అబ్బబ్బ, ఓ వైపున నాలుక పిడచ గట్టుకపోతుంటే, నీ సందేహాలతోనే చంపేస్తావా శేఖరం"

కథ శ్రుతిమించి రాగాన పడుతోందని గ్రహించాను. రోడ్డువెంట ఫర్లాంగు దూరం నడిచే సరికి సన్నటి కాలిబాట కనిపించింది. తన అంచనా తప్పు గాకపోతే ఆ కాలిబాట చివరలో పల్లెటూరుంటుందన్నాడు శ్రీహరి. ఉండక తప్పదని హామీ గూడా ఇచ్చాడు. అనతి దూరంలో పల్లె కనిపించింది. ప్రకృతిమాత ఒడిలో ప్రశాంతంగా నిద్రపోతున్న

పల్లెటూరు చింతచెట్ల, గుబుర్ల క్రింద చిన్న చిన్న పూరిండ్లు, కొట్టాల్లో కునికిపాట్లు పడుతున్న గొడ్డు గోదలు, కుక్కలు తరుముకుంటాయేమోనన్న భయం ఉండనే ఉంది. ఐనా ఊరిలోపలికి వెళ్ళక తప్పదు. బురదనీరు నిలిచి ఉన్న సన్నటి వీధి గుండా వెళ్తుండగా ఎవరో పలకరించారు.

"ఎవురు బాబూ! ఎక్కడి కెళ్తున్నారు...."

జవాబు చెప్పమన్నట్టుగా ముంజేతిని నొక్కాడు శ్రీహరి.

"ఎవరైతే నేమిగానీ దారి దప్పి ఇలా వచ్చేశాము. తిండి తిప్పలు లేకుండా శోషిల్లిపోయాను...."

కళ్ళు నులుముకుంటూ ముసలాయన దగ్గరికి వచ్చేశాడు. "దారి తప్పి వచ్చారా! చూడ్డానికి మా రాజు బిడ్డల్లా ఉన్నారే! ఎక్కడినుంచీ వచ్చారు? ఎలా వచ్చారు? దారెందుకు తప్పారు?"

సంగ్రహంగా వివరాలన్నీ చెప్పుకున్నాను. మా మాటలపై నమ్మకం లేకపోతే రోడ్డుపైకి వెళ్ళి ఆనవాలుగా మోటరు కారును చూచుకోమన్నాను.

మేము కారెక్కి వచ్చిన వాళ్ళమని తెలియగానే ముసలాయన మరీ తబ్బిబ్బు పడిపోయాడు.

"అలాగా నాయనా! మీ బోటి మారాజుల్ని కూచోమని చెప్పడానికైనా మాకేమున్నాయి? బాబ్బాబూ, ఇదిగిదుగో, ఇలా మంచంపైకి దయచేయండి. భూమి తల్లిని నమ్ముకుని బ్రతికే వాళ్ళ మా నాయనా! ప్రొద్దు గూట్లో పడేసరికి కలోగంజో త్రాగి కిమ్మనకుండా పడుకుంటాం. ఐనా ఎంత సేపు? గడియ సేపట్లో వంటైపోదూ! అయినా మీకు హితవుగా అన్నం పెట్టగలమని అనుకోకండి బాబూ! ఏదో మాకు కలిగింది."

ముసలాయన పలకరింపులకు ఇంటిల్లుపాదీ నిద్రలేచేశారు. ఆడవాళ్లు కొందరు గుమ్మంగుండా తొంగి తొంగి చూచి విస్మయంతో గుస గుసలాడుకుంటూ లోపలికి వెళ్ళారు. పడుచువాడొకడు అప్పటి కప్పుడు దోటి తీసుకెళ్ళి చెట్టునుంచి ఇన్నిచింత కాయలుకోసి తెచ్చాడు. నాలుగు పచ్చి మిరపకాయలు గిల్లివేసి, గుప్పెడు ఉప్పురాళ్లు, కుమ్మరించి ఇంటావిడ పచ్చడి తయారు చేసింది. అర్ధరాత్రప్పుడు వచ్చిన ఆగంతకులకోసం ఆ ఇంట్లో వంట క్షణాల్లో ప్రారంభమైంది. అయిపోయిందా అయిపోయిందా అని ముసలాయన వేగిరిస్తుండగా ఎసరు పెట్టేశాం, పొంగు వచ్చేసింది, గంజి వార్చేస్తున్నాం అని ఆడవాళ్ళు జవాబిస్తున్నారు.

ఖరుకు అన్నాలు గూడా ఆకులోకి వచ్చేశాయి. కూరలు లేనందుకు కించపడిపోతూ ఇంటావిడ ఆకులోని అన్నమంతా మూసుక పోయేటట్టు గిన్నెలోనుంచీ గడ్డ పెరుగు కుమ్మరించింది. పొగలెగసిపోతున్న పచ్చి బియ్యపన్నం చింతగింజ మునగని చిక్కని గేదె పెరుగు, పచ్చి మిరపకాయల చురుకుదనంతో రున రుసలాడుతున్న చింతకాయల పచ్చడి....నాలుగు ముద్దలు మ్రింగి శ్రీహరి వైపు చూచాను. అన్నాతురుడికి మొగమాటాలకు చాలా దూరమేమో, శ్రీహరి ఎదుటనున్న విస్తరి ఖాళీగా ఉంది.

"ఏమిటో నాయనా! మొదటే చెప్పాను మీకు పెట్టగలిగిన వాళ్ళం కామని! మాకున్న భాగ్యమింతే మరి! ఏమనుకున్నారో ఏమిటో...."

పాపం! ఆ పల్లెటూరి ముసలాయన అమాయకుడు. సుష్టుగా భోజనం చేసిన సంతృప్తి రాజ్యాలుగెలిచిన ఆనందంలా శ్రీహరి ముఖంలో వెలుగు లీనుతుండడం ఆయన గ్రహించలేకపోయాడు.

తిరుగు దారిలో నూటికి విలువైన మాట ఒకటన్నాడు శ్రీహరి– "పల్లెటూళ్ళల్లో భోజనం ఇంత రుచిగా ఉంటుందా శేఖరం! నేను కలలోనైనా అనుకోలేదంటే నమ్ము!"

శ్రీహరి సందేహానికి సమాధానం చెప్పకుండా ఓ చిరునవ్వుతో తప్పించుకున్నాను. కానీ నా అంతట నేను మాత్రం అతడికి చెప్పి ఉండవలసిన సమాధానాన్ని గురించి తీరిగ్గా ఆలోచించక పోలేదు. కష్టపడినకొద్దీ ఫలితం. శ్రమ పడినకొద్దీ సుఖం. కూర్చున్నా, పడుకున్నా, కునికిపాట్లతో కాలాన్ని వేగిస్తున్నా కొందరికి షడ్రసోపేతమైన భోజనం వాళ్ళెక్కడుంటే అక్కడికి వెదుక్కుంటూ వస్తుంది. వనిత తనంతట తాను వలచి వస్తే ఎవరికైనా చులకనే! భోజనం సంగతి గూడా అంతే మరి! తన అలవాటుకు విభిన్నంగా శ్రీహరి ఆ రాత్రి పూట భోజనంకోసం ఎంత అవస్థ పడ్డాడన్న విషయం మళ్ళీ ఇక్కడ చెప్పవలసిన అవసరం ఏముంది? అది పాఠక మహాశయుల కందరికీ తెలుసు!

(ఆంధ్ర సచిత్రవారపత్రిక 13-12-1963)

❀ ❀ ❀